# మాగంటి

# అమ్మతో ప్రయాణం

* రెండు వారాల కథ

**కౌసల్య అంతరంగ మథనం ఒక కొలిక్కి రాకముందే... తల్లిని ప్రక్క బోగీలో కూర్చోపెట్టి, తిరిగొచ్చి... కౌసల్యకి ఎదురుగా వున్న సీట్లో కూర్చుని... ఏదో మాగజైన్ అందుకుని తాపీగా అందులో మునిగిపోయాడు.**

మద్రాస్ — హైదరాబాద్ చార్మినార్ ఎక్స్‌ప్రెస్ మరో అయిదు నిమిషాల్లో చెన్నపట్నాన్ని విడిచిపెట్టడానికి సిద్ధమైపోతోంది.

గార్డు నింపాదిగా పచ్చజెండా మడతలు విప్పుకోవడం మొదలుపెట్టాడు.

దానితో ఆరవ నంబరు ప్లాట్‌ఫారం మీద ఆఖరి నిమిషం హడావుడి పతాకస్థాయికి చేరిపోయింది.

రోడ్డు రవాణా సంస్థ బస్సులో ఫుట్‌బోర్డులకి శరీరాల్ని వేలాడదీసుకుంటూ అతికష్టం మీదగాని స్టేషన్‌కి చేరుకోలేకపోయిన అభాగ్య ప్రయాణీకులూ...

అటో వాళ్ళ దాష్టీకానికి అతివిలువైన కాలాన్ని రోడ్డు మీదనే పోగొట్టుకున్న అసహాయ యాత్రికులూ...

సొంత కార్లుండి కూడా చివరి క్షణంలో వచ్చి బండెక్కటమే గొప్పగా భావించే నియో రిచ్ వి.ఐ.పీ.లూ...

ఇందరి అర్జెన్సీల్ని తలకెత్తుకుని రొప్పుతూ రోజుతూ రైళ్లోకి లగేజీలు మోస్తున్న కావ్రగస్థ హెర్క్యులిసుల్లాంటి ఎర్రచొక్కా పోర్టర్లూ...

మరి కాసేపట్లో బండి బయల్దేరిపోతుందని తెలిసి కూడా ఆశచావని "చాయ్... కాఫీ" అమ్మకాల కేకలూ...

గందరగోళం...

తొక్కిసలాట...

ఉరుకులు పరుగులు...

ఉక్కిరిబిక్కిరి...

సమస్త భూప్రపంచంలో కేవలం మనిషికి మాత్రమే సృష్టించడం, అనుభవించడం చేతనైన కన్‌ఫ్యూజన్... కేయాస్!

—వీటన్నిట్నీ దాటుకుంటూ వెళ్ళి గబగబ 'త్రీటయర్' కంపార్ట్‌మెంట్‌లోకి చొరబడ్డాడు శ్రీనివాసులు.

"కౌసల్యా! ఈ రెండు సీట్లూ మనవే. నువ్వు, అమ్మా కూర్చోండి. ఆ లగేజీని సీట్ల కిందికి సర్దెయ్యండి. నీకే చెప్పేది; వంటాడు జాగ్రత్త. అమ్మా; కాసేపు వాణ్ణి నీ వళ్ళో పడుకోబెట్టుకో..."

—భార్యకి, తల్లికి అలా చెబుతూనే పక్క సీట్లోని వాళ్ల దగ్గరకు పరుగుపెడుతున్నంత వేగంగా వెళ్ళాడు శ్రీనివాసులు.

"సార్ మేం ముగ్గురున్నాం. అందులో ఇద్దరికి ఇక్కడ, ఒకళ్ళకి పక్క పెట్టెలో సీట్లు దొరికాయి. దయచేసి మీలో ఎవరైనా పక్క కంపార్ట్‌మె[illegible] వెళితే మేం ముగ్గురం ఇక్కడ అడ్జెస్టయిపోతాం. [illegible]"

శ్రీనివాసులు మాటంటు పక్కసీటు ప్రయాణీకులు ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

సరిగా బండి బయల్దేరే టయములో వచ్చి అడ్జెస్టుమెంటంటే ఎలా కుదురుతుంది? చివరి నిమిషంలో లగేజీల్తో సహా ఇంకో పెట్టిలోకి మారటమంటే మాటలా?

"...చార్మినార్ ఎక్స్‌ప్రెస్ బౌండ్ టు హైదరాబాద్ ఈజ్ రెడీ టు స్టార్ట్ ఫ్రమ్ ప్లాట్‌ఫామ్ నంబర్ సిక్స్..."

శ్రీనివాసులుకి ఏం చెప్పాలా అని ఆలోచిస్తున్న కో–పాసింజర్లకి ప్లాట్‌ఫామ్ మీది పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ నుంచి ఖంగుమంటూ వినిపించిన అనౌన్స్‌మెంట్‌తో పెద్ద బరువు దిగిపోయినట్టయింది.

"ఇంకేం మారతామండీ... అవతల బండి బయల్దేరిపోతుంటే..."

విసుగ్గా విసవిసలాడి ముఖాలు తిప్పేసుకున్నారు వాళ్ళు.

ఆ తిరస్కారానికి తల కొట్టేసినట్టనిపించింది శ్రీనివాసులుకి.

హైదరాబాద్‌లో అంత పెద్ద ఉద్యోగం చేసుకుంటున్న తను... ఆఫ్టాల్ ఒక రైలు సీటు కోసం అడ్డమైన వాళ్ళని ప్రాధేయపడాల్సొచ్చింది!

అసలిదంతా తన స్వయంకృతం.

వేసవి సెలవుల్లో రైళ్ళు రద్దీగా వుంటాయని తెలిసి కూడా తను ఈ ప్రయాణం పెట్టుకున్నాడు.

—పెళ్ళయిన తర్వాత ఈ అయిదేళ్ళలో తను కౌసల్యకు హైదరాబాద్ తప్ప మరొక వూరంటూ చూపించింది లేదు.

[illegible] వెళ్దామనుకున్నా ఏవో ఉద్యోగ సమస్యలు... [illegible]!

అయిదేళ్లుగా [illegible] పదిరోజులైనా భార్యని తీసు[illegible] రావడానికి వీల్లేని గానుగెద్దు జీవితం!

ఈ 'మొనాటనీ'ని బద్దలు కొట్టడానికే ఆరు నెలలపాటు సీరియస్‌గా ప్లాన్‌చేసి ఆఖరికి ఈ మద్రాస్ ట్రిప్ ఖరారు చేశాడు తను.

అయితే... తను ఇంత కష్టపడి... అయిదేళ్లలో మొదటిసారిగా ఈ 'అవుట్ స్టేషన్' ప్రయాణం పెట్టుకుంటే... చివరి నిమిషంలో ఆ కౌసల్య చేసిందేమిటి!

తనతో మాట మాత్రమైనా అనకుండా తన 'అత్తమ్మ'ని కూడా తనతోపాటు మద్రాసుకు బయల్దేరదీసింది!

కౌసల్యకి 'అత్తమ్మ' అంటే ఆమె తనకి సాక్షాత్తు అమ్మే!

ఆమె తనకి జన్మనిచ్చిన తల్లి... పార్వతమ్మే!

అయినా... అయినా...

ఈ రద్దీలో... ఈ ఎండల్లో ఆమె తమతోపాటు ఏం ప్రయాణం చేయగలుగుతుంది!

అసలే వయసు పైబడిపోయింది. పైగా ఎప్పుడూ ఏదో ఒక అనారోగ్యం!

ఈ స్థితిలో ఆమెగారు మద్రాసు చూడకపోతే మాత్రం వచ్చిన నష్టం ఏమిటి?

హాయిగా కృష్ణా రామా అనుకుంటూ ఇంటి పట్టున వుండి శేషజీవితాన్ని చల్లగా గడపక కౌసల్య పిలిచిందే చాలని తగుదునమ్మా అంటూ ఆమె తమతో పాటు వందల మైళ్ళ ప్రయాణానికి బయల్దేరాలా!

గట్టిగా రెండు దులిపి... ఆమెగారి ప్రయాణాన్ని ఆపుచెయ్యాలని మనసులో వున్నా తను కౌసల్యకి భయపడి నోరు తెరవలేకపోయాడు.

అసలీ కలికాలంలో తప్పు పుట్టింది కౌసల్య!

తను ఎంత మొత్తుకున్నా వినకుండా ప్రతిదానికి అత్తని వెనకేసుకొస్తుంది.

కాకపోతే ఆమెకి మరెవరు వూళ్ళు చూపిస్తారు..." అంటుంది.

"అది కాదు కౌసల్యా! అసలే అమ్మకు అనారోగ్యం" అని నచ్చజెప్పబోతే... "అలా



ఆమె కౌసల్యకి అత్త అయితే... తనకి కన్నతల్లి కాదా?

తనకి మాత్రం ఆమెపట్ల బాధ్యత లేదా?

అయినా... అయినా... తను ఒక్కర్తే అత్తగారికి వకాల్తా అయినట్టు మాట్లాడుతుంది కౌసల్య!

అత్తగారి విషయంలో ఆమె అప్పుడప్పుడు తనకిచ్చే లెక్చర్లు చూస్తుంటే... అసలు కౌసల్య తనో సతీసుమతి, లేదంటే సతీ అరుంధతి, అదీ కాదంటే పెద్ద సతీసావిత్రి ననుకుంటున్నదేమోనని తనకి అనుమానం!

"అంత దూరం ప్రయాణానికి అమ్మ మనతో పాటెందుకూ..." అంటే... "అదేమిటండీ మనం అంటారేమిటండీ; మీకు రెండేళ్ళ వయసప్పుడు మీకు ప్రాణాంతకమైన జబ్బు వస్తే ఆమె మీ కోసం ముక్కోటి దేవతలకు మొక్కుకుని... మిమ్మల్ని చంక కెత్తుకుని దేశంలోని పుణ్యక్షేత్రాలన్నీ తిరిగిరాలా..." అని గుక్క తిప్పుకోకుండా గతమంతా వర్ణించి పారేస్తుంది–

తన చిన్నప్పుడెప్పుడో అమ్మ తనని అలా దేశంలోని గుడులు గోపురాలకి తిప్పింది కదా అని ఇప్పుడు తను ఆమెని దేశ పర్యటనకి తీసుకెళ్ళడం ఎలా కుదురుతుంది?

మనిషన్నాక ప్రాక్టికల్ అప్రోచ్ అవసరం. ఈ రోజుల్లో ప్రయాణమంటే మాటలా? ఒక మనిషికి ఇంకొక మనిషి తోడయితే ఖర్చులు ఎంత విపరీతంగా పెరిగిపోతున్నాయి!

పైగా... తనది అసలే ఖరవై నాలుగ్గంటలూ ఏర్‌కండిషన్‌కి అలవాటుపడిన శరీరం! తనూ, కౌసల్యే గనుక... రానుపోను ఎంచక్కా సెకండ్ ఏ.సీలో ప్రయాణం చెయ్యొచ్చనుకున్నాడు.

కాని... కాని... మంది ఎక్కువయితే మజ్జిగ పలచబడిపోయినట్టు... అమ్మ కూడా బయల్దేరడంతో ఏ.సీ కంఫర్ట్ వదులుకుని ఆర్డినరీ త్రీటయర్‌లో సీట్లు బుక్ చేసుకోవాల్సి వచ్చింది.

పోనీ ఆ సీట్లయినా ఒకేచోట దొరికాయా అంటే... అదీ లేదు... రెండు ఒక పెట్టెలో... మరొకటి ఇంకొక పెట్టెలో!

ఇప్పుడిక... ఏ క్షణంలోనైనా సరే బండి కదలడానికి సిద్ధంగా వుంది. కాని... ప్రక్కసీట్లలోని ఒక్కడూ పెట్టె మారడానికి సుముఖంగా లేడు.

మరి... ఇప్పుడేమిటి చెయ్యడం? సీట్లలో కూర్చోబెట్టి... తను పెట్టెలో ఏదో ఒక మూల బెడ్‌షీటు పరుచుకుని కాలం గడపక తప్పని పరిస్థితి ఏర్పడేటట్టుంది.

మై గుడ్‌నెస్! అదే జరిగితే ఇంకేమైనా వుందా? అసలే ఇది హైదరాబాద్ వెళ్ళే బండి! తెలిసిన వాళ్ళెవరైనా చూశారంటే ఎంత నామోషీ!

పోనీ... అమ్మనీ, కౌసల్యనీ ఈ బోగీలో కూర్చోబెట్టి... ఎటూ సీటుంది గనుక... తను ప్రక్క బోగీలోకి వెళ్ళిపోతే?

ఏమో?

రోజులసలే బాగాలేవు. రైళ్ళలో దోపిడీలే కాదు... ఏకంగా 'రేప్'లే జరిగిపోతున్నాయి!

మగతోడు లేకుండా ఆడవాళ్ళిద్దర్నీ ఇక్కడ వదిలిపెట్టి తను వేరేచోట కూర్చోవడం తనకి ఏ రకంగానూ ఇష్టం లేదు.

అందునా... కౌసల్య ఎర్రగా... బుర్రగా... కుందనపు బొమ్మలా... కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

మగవాళ్ళెవ్వరూ పక్కనలేరని తెలిసి ఏ రౌడీవెధవలైనా చొరవ చూపిస్తే...

గాడ్! ఎంత ఖర్మొచ్చిపడింది. అందమైన భార్య వుంటే అడుగడుగునా భయపడాల్సిన రోజులు దాపురించాయి!

"ఏమిట్రా శ్రీనివాసులూ... అలా అయోమయంగా నిలబడిపోయావు? అవతల బండి బయల్దేరే వేళైపోతోంది. పోనీ నన్ను తీసుకెళ్ళి పక్క పెట్టెలో కూర్చోబెట్టరాదూ... ముసల్దాన్ని... నేనెక్కడ కూర్చొంటే మాత్రం ఏమవుతుంది!"

పరిపరి విధాల ఆలోచనలతో సతమతమయిపోతున్న శ్రీనివాసులుకి పార్వతమ్మ మాటలతో పెద్దబరువు దిగిపోయినట్టయింది.

"మరయితే ఆలస్యం దేనికి? పద పద; బండి బయల్దేరిపోతోంది..."

మరొక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా తల్లి తాలూకు లగేజీని చేతుల్లోకి తీసుకుంటూ తొందర పెట్టేశాడు.

"అయ్యో, అదేమిటండీ? అత్తయ్యగారు అసలే అనారోగ్యం మనిషి. ఈ మధ్య రాత్రిళ్ళు జ్వరం కూడా వస్తోంది. ఆ పెట్టెలో ఒక్కరే ఎలా వుంటారు?"

భర్త తొందరను కనిపెట్టి గబగబ అడిగింది కౌసల్య.

"జ్వరం వస్తే మధ్యలో వెళ్ళి నేను చూస్తుంటాగాని... నువ్వు అనవసరంగా ఖంగారుపడకు. అవతల బండి బయల్దేరిపోతోంది —పదమ్మా... నువ్వు పద"


కౌసల్యకి మరో మాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా తల్లికి సంబంధించిన లగేజీ వున్న ఆర్లిక బుట్టని చేతిలోకి తీసుకుని గబగబ పెట్టెలోంచి దిగేశాడు శ్రీనివాసులు.

అంతాక తన వొళ్ళో వున్న ఆరునెల్ల మనవడిని కౌసల్యకి భద్రంగా అందించి... ఆ అరనిమిషంలోనే కోడలికి అనేక జాగ్రత్తలు చెప్పి... కొడుకు వెంట మరో బోగీలోకి వెళ్ళిపోయింది పార్వతమ్మ.

అలా వెళ్తున్న అత్తగారిని చూసి మనసంతా బాధతో మెలితిరిగినట్టయిపోయింది కౌసల్యకి.

ఆమె తనకి అత్తమాత్రమే కాదు; తను నిత్యం కొలిచే దేవత. చిన్నతనంలోనే తల్లిని కోల్పోయిన తనకి ఆ మహాతల్లి అత్తగా లభించడం నిజంగా తన పూర్వజన్మ సుకృతం.

తను కాపురానికొచ్చిన కొత్తలో అత్తమ్మ తనకి



అద్దం

సినీతార విజైమాలినిని అడిగాడు విలేకరి.

"మీ వయసు అడిగితే అద్దం చూసుకుని చెప్తున్నారేంటీ?"

"నాకు అద్దమే కాలెండర్" అంటూ గిస్సుక్కున నవ్వింది.

—పద్మశ్రీ (మాణిక్యారం)

చెప్పిన ఆమె జీవితానుభవాలు తనకి ప్రతినిత్యం గుర్తుకొస్తుంటాయి.

వయసులో వుండగానే భర్తని కోల్పోయిన ఆమె అనూహ్యంగా తన మీద విరుచుకుపడిన కష్టాల్ని అచ్చమైన భూదేవిలా భరించింది.

వితంతువుగా మారి పుట్టెడు దుఃఖంలో వున్న ఆమెకి విధి వెంట వెంటనే విషమ పరీక్షలు పెట్టింది. జీవితంలో ఒకే ఒక్క ఆశగా ఆమెకి మిగిలిన రెండేళ్ళ కొడుకుకి లివర్ జబ్బు ముదిరింది. పెద్దపెద్ద డాక్టర్లే పెదవి విరిచేశారు.


అయినా... అంత తేలికగా ఓడిపోదలుచుకోలేదు పార్వతమ్మ.

భగవంతుడి మీద భారంవేసి... ముక్కోటి దేవతలకి మొక్కుబడులు చెల్లించుకుంటూ... కొడుకుని భుజానికి కట్టుకుని... దేశంలోని పుణ్యక్షేత్రాలన్నీ తిరిగింది!

మరి... అంతమంది దేవుళ్ళలో ఏ దేవుడు కరుణించాడో తెలియదు గాని... అంతిమ విజయం ఆమెదే అయింది! ఆమె ప్రాణంలో ప్రాణమైన శ్రీనివాసులు ప్రాణాలు నిలబడ్డాయి!

అయినా ఆ తల్లికి ప్రాణం కుదుటపడలేదు. ఏ రాత్రివేళలోనో కొడుక్కి మళ్ళీ రోగం తిరగబెడుతుందేమో? ఏ నిద్రలో వుండగానో తన చిట్టితండ్రిని మృత్యువు కమ్ముకుంటుందేమో?

ఆ భయంతో తను కొన్ని సంవత్సరాలపాటు రాత్రిళ్ళు నిద్రపోకుండా కొడుకు మంచం ప్రక్కనే గడిపానని తన అత్తగారు తనకి చెప్పినప్పుడు ఆమె త్యాగానికి తన మనసు కరిగి నీరై తను వెక్కిళ్ళు




టిట్ బిట్



సూర్యకాంతి భూమిని చేరటానికి ఎంత సమయం పడుతుంది!

8.3 నిమిషాలు.

—ప్రసాద్



## బాధితుడు



"ఏమోయ్ ఆనందం? మీ ఆవిడ్ని తొలిసారిగా ఎలా చూశావోయ్... అహా... కవ్వింపుగానా? చిరునవ్వుతోనా?"

"ఖర్మకాలి... చూశా — సర్నా?"

"??!"

—మహర్షి (కొత్తగూడెం)

పెట్టి ఏడ్చిన క్షణాలు మళ్ళీ గుర్తుకొచ్చాయి కౌసల్యకు.

అలాంటి తల్లిని... ఇప్పుడు ఈ పదిహేను గంటల రైలు ప్రయాణంలో ప్రక్క పెట్టెలో ఒంటరిగా కూర్చోబెట్టి రావడానికి ఎలాంటి సంకోచం లేకుండా వెళ్ళాడు... ఆమె నోముల పంట అయిన తన భర్త!

"అత్తయ్యకి ఏ రాత్రివేళో జ్వరమొస్తుందేమోనండీ..." అని తను అంటే... "జ్వరం వస్తే... మధ్యలో నేను వెళ్ళి చూసొస్తాన్లే..." అని తేలికగా తీసిపారేశాడా మనిషి!

తన చిన్నతనంలో... తనని కళ్ళలో వత్తులు వేసుకుని కాపాడిన కన్నతల్లి అనారోగ్యాన్ని ఎంత యధాలాపంగా భావించ గలుగుతున్నారాయన!

తల్లికి వయసయిపోయినంత మాత్రాన... తల్లితో అవసరం తీరిపోయినంత మాత్రాన ఆమెపట్ల అంత నిర్లక్ష్యాన్ని, నిర్దయని చూపించడం అన్యాయంకాదా?

ఒక చిన్న రైలు ప్రయాణంలోనే అమ్మపట్ల అలక్ష్యం చూపుతున్న ఈ కొడుకు జీవిత ప్రయాణంలో ఆమెను సాఫీగా తుదిగమ్యం దాకా చేర్చుతాడని నమ్మకం ఏమిటి?

అసలు... ఎన్నో విషయాల్లో ఎంతో మంచిగా వుండే తన భర్త... తల్లి విషయానికొచ్చేటప్పటికి చిరుబుర్రులాడటం... చికాకు పడిపోవడం... అప్పుడప్పుడు ఆమె మీద నోరు చేసుకోవడం ఎందుకు చేస్తాడో తనకిప్పటికీ అర్థం కాదు!

ఒక జీవితకాలాన్ని కన్నబిడ్డ కోసం ధారపోసిన మాతృమూర్తి... వయసుడిగిపోయాక అదే బిడ్డకి ఎందుకంత చులకన అయిపోతుంది?

వార్ధక్యంలో ప్రవేశించిన తల్లిని ఒక బరువుగా... ఒక భారంగా... తిరస్కరించుకోవడానికి మాత్రమే పనికొచ్చే వ్యర్థ పదార్థంగా కొడుకులెందుకు భావిస్తారు?

బాల్యంలో తనపట్ల తల్లి చూపించిన శ్రద్ధలో కనీసం వెయ్యోవంతయినా ఆమె ముసలితనంలో ఆమెపట్ల చూపించలేని స్వార్థం, స్వప్రయోజనం, నిరాసక్తత, నిర్లక్ష్యం... ఆమె రక్తం పంచుకు పుట్టిన కొడుకులోనే అసలెలా ప్రవేశిస్తాయి?

—కౌసల్య అంతరంగ మథనం ఒక కొలిక్కి రాకముందే... తల్లిని ప్రక్క బోగీలో కూర్చోబెట్టి... తిరిగొచ్చి... కౌసల్యకి ఎదురుగా వున్న సీట్లో కూర్చొని... ఏదో మాగజైన్ అందుకుని తాపీగా అందులో మునిగిపోయాడు శ్రీనివాసులు.

అనారోగ్యంతో వున్న తల్లిని వేరే పెట్టెలో ఒంటరిగా కూర్చోబెట్టి వచ్చానన్న దిగులు లేశమైనా కనపడడంలేదు — ఏం మనిషో ఏమో?

భర్తని తదేకంగా చూసి భారంగా నిట్టూర్చింది కౌసల్య.

ఆ నిట్టూర్పు శ్రీనివాసులుకి వినిపించకముందే... వారిని భాగ్యనగరం దాకా మోసుకెళ్ళాల్సిన చార్మినార్ ఎక్స్‌ప్రెస్ పెద్దగా కూతపెట్టి ప్లాట్‌ఫారం నుంచి బయల్దేరింది.

అలా బయల్దేరిన రైలు ఆ తర్వాత సూళ్ళూరుపేట చేరుకునేదాకా అంతా సవ్యంగానే జరిగిపోయింది.

సూళ్ళూరుపేటలో బండి ఆగిన తర్వాత... శ్రీనివాసులుకి ప్రక్క పెట్టెలో కూర్చొని వున్న పార్వతమ్మ దాహంగా వుందనిపించి నీళ్ళ సీసా కోసం తనతో తెచ్చుకున్న అల్లికబుట్టలో చెయ్యి పెట్టింది.

అయితే నీళ్ళ సీసాకి బదులు పాలసీసా చేతికి రావడంతో ఆమె గుండె గుభిల్లుమంది!

అది తన మనవడు తాగే పోతపాల సీసా! పెట్టె మారేటప్పుడు హడావుడిలో దాన్ని తను కౌసల్యకివ్వడం మర్చిపోయింది!

ఇప్పుడేమిటి చెయ్యడం? కౌసల్య కొన్నాళ్ళపాటు పంటాడికి పాలివ్వకూడదని డాక్టర్లు చెప్పడంతో వాడికి పోతపాలే పడుతున్నారు.

పంటాడికి కనుక ఆకలి వేసిందంటే ఇల్లు పీకి పందిరేసేస్తాడు. పాలసీసా చూస్తే తన దగ్గరుండిపోయింది! ఏ మధ్య రాత్రిలోనో వాడు ఏడుపు మొదలుపెట్టాడంటే... పాపం కౌసల్య వాడిని సముదాయించలేక అల్లాడిపోతుంది.

తన దాహం సంగతి కూడా మరిచిపోయింది పార్వతమ్మ. పాల సీసాని చూస్తున్న కొద్దీ ఆమెలో ఆందోళన, ఆత్రుత అధికమైపోయాయి.

"ఈ స్టేషన్లో బండి కాసేపు ఆగేటట్టుగానే వుంది. దిగెళ్ళి ప్రక్క పెట్టెలోని కౌసల్యకి ఈ పాలసీసా ఇచ్చివస్తే?..."

—ఇక వుండబట్టలేకపోయింది పార్వతమ్మ. పాలసీసాతోసహా గబగబ రైల్లోంచి దిగిపోయి ప్రక్క పెట్టె దగ్గరకు పడుతూ లేస్తూ పరుగెత్తింది.

"ఒరేయ్ శ్రీనివాసులూ... శ్రీనివాసులూ..."

రైలు కిటికీల్లోంచి లోపలికి తొంగిచూస్తూ... కొడుకుని పేరుపెట్టి గట్టిగా పిలుస్తూ... ప్లాట్‌ఫారం మీద ముందుకు పరుగెత్తసాగింది పార్వతమ్మ.

అయితే ఆ హడావుడిలో తను తన బోగీకి ముందు ప్రక్కన వున్న బోగీ దగ్గరకు వెళ్ళాల్సింది పోయి వెనక ప్రక్కన వున్న బోగీ దగ్గరకు వెళ్ళానని అర్థం చేసుకోలేకపోయిందా పిచ్చితల్లి!

ఆ బోగీ దగ్గర ఎంత పిలిస్తే మాత్రం పలుకుతాడు శ్రీనివాసులు!

ఆమె ఖంగారుగా రైలు కిటికీల దగ్గర అటుఇటు పరుగెడుతూ కేకలు పెడుతుండగానే రైలు గట్టిగా కూతపెట్టి కదిలిపోయింది.


దానితో మరింత ఖంగారైపోయింది పార్వతమ్మ. మళ్ళీ పడుతూ లేస్తూ తన బోగీ దగ్గరకు పరుగెత్తబోయింది.

అయితే ఆమె అక్కడికి చేరుకునేలోగానే ఆ చార్మినార్ ఎక్స్‌ప్రెస్ అతినిర్దాక్షిణ్యంగా వేగం పుంజుకుని... ఆమె కళ్ళెదుటే ఆమెకి అందకుండా పోయి... అరనిమిషం వ్యవధిలో ప్లాట్‌ఫారంని దాటి కనుమరుగైపోయింది!

ఒక్కసారిగా దుఃఖం పొంగుకొచ్చింది పార్వతమ్మకి. తన కొడుకు కోడలు, మనవడు ఆ రైల్లో వెళ్ళిపోతే... తను మాత్రం... తన చేతిలో పాలసీసాతో ప్లాట్‌ఫారం మీద ఒంటరిగా మిగిలిపోయింది!

ముగింపు

వచ్చేవారం *









### రూ.కోటి

ఎన్.టి.ఆర్ రాఘవేంద్రరావు దర్శకత్వంలో ఒక తెలుగు చిత్రంలో నటించనున్నట్లు, రెమ్యూనరేషన్ ఒక కోటి రూపాయలదిగా వుండవచ్చునని వార్తలు వస్తున్నాయి. ఆ నిర్మాత ఎవరో ఇంతవరకు తెలియదు. అయితే ప్రముఖ హిందీ నిర్మాత సుభాష్‌ఘయ్ ఎన్‌టిఆర్ ఒక ప్రధాన పాత్రగా బుక్‌చేసి హిందీ చిత్రం నిర్మించటానికి ప్రయత్నిస్తున్నాడు.

—శరత్ కుమార్